క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం పరిశీలన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కో ఆర్డినేటర్ జేఎస్ శాస్త్రి

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టులోని ఎంపీపీ పాఠశాలను విశాఖ జిల్లా మధ్యాహ్న భోజన కో ఆర్డినేటర్ జేఎస్ శాస్త్రి గురువారం పరిశీలించారు. ఇక్కడ విద్యార్థులకు ఏర్పాటు చేస్తున్న భోజనం నాణ్యత, మెను తెలుసుకున్నారు. మెనూ ప్రకారంగా ప్రతి రోజూ భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగారు.

వైద్య సేవలపై ఆరా



ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న హెల్త్ మిషన్ ఉద్యోగులు

మధురవాడ: మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి సందర్శించారు. ఇక్కడ అందుతున్న వివిధ రకాల వైద్య సేవలపై వైద్యాధికారి ప్రశాంతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా పద్మావతి దృష్టికి పలు సమస్యలను నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు తీసుకువెళ్లారు. ముఖ్యంగా ఎఫ్ఆర్ఎస్‌ని ఆధారంగా చేసుకుని ఉద్యోగుల జీతాలు కట్ చేస్తున్నారని, కొన్ని సందర్భాల్లో సిగ్నల్ ప్రాబ్లమ్ వలన కూడా ఎఫ్ఆర్ఎస్ అవ్వడం లేదని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై దృష్టిపెట్టండి



సుభాష్ నగర్‌లో పర్యటిస్తున్న జిల్లా మలేరియా శాఖ అధికారి తులసీ రాజ్

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ దరి సుభాష్‌నగర్‌లో గురువారం జిల్లా మలేరియా శాఖ అధికారి తులసీ రాజ్ పర్యటించారు. ఈ ప్రాంతంలో మలేరియా కేసు నమోదు కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వార్డులో అన్ని ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని శానిటరీ సిబ్బందికి సూచించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో నీరు ఎక్కడా నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు నగేష్ పట్నాయక్, మంగరాజు, రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

72 మెగా పేరెంట్స్ సమావేశం

పద్మనాభం: పాఠశాలల్లో ఈ నెల ఏడో తేదీన మెగా పేరెంట్స్ మీటింగ్‌ను పండగ వాతావరణంలో నిర్వహించాలని ఎంఈవోలు పి.రమణ, ఎస్‌డీ బాబూలాల్ అన్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో గురువారం సాయంత్రం మెగా పేరెంట్స్ మీటింగ్‌పై వీడియో కాన్ఫరెన్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమావేశానికి వచ్చే తల్లిదండ్రులకు మధ్యాహ్న భోజనం మెను ప్రకారం పెట్టాలన్నారు. విద్యార్థుల ప్రగతిని తల్లి దండ్రులకు హోలిస్టిక్ కార్డు ద్వారా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి ఎం.వి. కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

27 మద్యం సీసాల స్వాధీనం

పీఎంపాలెం: పీఎం పాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ప్రాంతాల్లో సహాయ కమిషనర్ సీహెచ్ వీ మహేష్ ఆదేశాల మేరకు ఏపీ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించారు. ఆర్‌హెచ్ కాలనీలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం వద్ద 21 మద్యం సీసీలు కలిగి ఉన్న కసిరెడ్డి రామును అదుపులోకి తీసుకున్నారు. అలాగే అదే కాలనీలో ఆంజనేయస్వామి గుడి వద్ద నీలపు లక్ష్మి నుంచి 6 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ అప్పారావు తెలిపారు.

అంధకారంలో జీవనం

వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తం

పగలు వెలుగుతూ..రాత్రి ఆరుతూ

పట్టించుకోని అధికారులు



బంగ్లామెట్ట శివాలయం వద్ద కుక్కలు







తగరపువలస: వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. నగరవ్యాప్తంగా వీధి దీపాల నిర్వహణపై తీవ్ర అసంతృప్తి నెలకుంది. లైట్లు ఎప్పుడు వెలుగుతాయో, ఎప్పుడు ఆరిపోతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల పగలు, రాత్రి తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. కొన్ని చోట్ల రాత్రి సమయంలో దీపాలు వెలగక అంధకారం అలముకుంది. దీనికితోడు రహదారులపై పశుసంచారంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రాత్రి సమయంలో పశువులు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే కుక్కల కారణంగా పలువురు గాయపడుతున్నారు. అంతేకాకుండా చిల్లర దొంగతనాలు కూడా జోరందుకుంటున్నాయి. ముఖ్యంగా ఆటోలు, ద్విచక్రవాహనాల నుంచి టైర్లు, పెట్రోల్, బ్యాటరీలు చోరీకి గురవుతున్నాయి.

తగరపువలస నుంచి భీమిలి వెళ్లే రహదారిలో చెట్ల కొమ్మల మాటున ఉన్న వీధిలైట్లు వెలుగుతున్నా రహదారులపై చెట్ల నీడ పడుతోంది. హుద్‌హుద్‌కు ముందు వీధులలో పెద్ద లైట్లు ఉండేవి. వీటి నుంచి ఎక్కువ వెలుగు వచ్చేది. హుద్‌హుద్ తరువాత చాలా చోట్ల ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. ప్రారంభంలో వీటి వెలుగులు బాగానే ఉన్నా కొద్ది రోజులకే ఇవి డల్‌గా మారిపోతున్నాయి. ఇటీవల తుపాను కారణంగా చిట్టివలస జ్యూట్‌మిల్లు రోడ్డు, బంగ్లామెట్ట శివాలయం వీధి రోడ్డులో లైట్లు వెలగకపోవడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు బుధవారం పునరుద్ధరించారు. ప్రస్తుతం గణేష్ థియేటర్ డౌన్‌తో పాటు బంగ్లామెట్ట నుంచి తాతా థియేటర్ వెనుక వరకు వీధి లైట్లు పనిచేయడం లేదు. దీనికి తోడు ఈ మార్గంలో జాతీయరహదారిపై కూడా అంధకారం అలముకుంది.

రోడ్లపై పశువులతో ప్రమాదాలు

భీమిలి జోన్‌లో రోడ్లపై పశువుల సంచారం ఎక్కువగా ఉంటుంది. పగటివేళ వాహనదారులు ఎలాగోలా రాకపోకలు సాగిస్తున్నా చీకటిపడితే వీటి బారి నుంచి తప్పించుకోవడం కుదరడంలేదు. తగరపువలస నుంచి బ్యాంకు కాలనీ వరకు..భీమిలి రోడ్డులో వందల సంఖ్యలో పశువులు రహదారులు అడ్డంగా ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే చిట్టివలస బంతాటమైదానంలో ఉండే వందలాది పశువులు తగరపువలస వీధులలో వాహనదారుల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నాయి.

వీధి దీపాలు పునరుద్ధరించాలి



భీమిలి మున్సిపాల్టీగా ఉన్నప్పుడు సక్రమంగా వీధిదీపాలు వెలిగేవి. జీవీఎంసీలో విలీనం తరువాత అంతకు మించి వసతులు కల్పించాల్సి ఉండగా చాలాచోట్ల వీధి దీపాలు డిమ్‌గా వెలుగుతున్నాయి.

–కుంచం రమణ, చిట్టివలస

ఇబ్బందులు పడుతున్నాం



భీమిలి జోన్‌లో నిత్యం ఏదో ఒకచోట వీధిలైట్లు వెలగడం లేదు. పూర్తిగా వీధి దీపాలైనా వెలిగించాలి. రోడ్లపై పశువులు తిరగకుండా చూడాలి. వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి సమయంలో దొంగతనాలు జరుగుతున్నాయి.

–గుజ్జు వెంకట పైడి సూరిబాబు, కొత్తపేట

కుక్కల బెడద



తగరపువలస నుంచి భీమిలి వైపు వెళ్లే వాకర్లు వీధి దీపాలు లేని కారణంగా ఇబ్బంది పడుతున్నారు. లైట్లు చాలా వరకు చెట్ల కొమ్మల మాటున ఉండటం వలన రోడ్లపై నీడ పడుతోంది. అదే సమయంలో పశువులు, విష పురుగులు, కుక్కలు దాడులు చేస్తున్నాయి.

–జి.తరుణ్ చైతన్యరెడ్డి

పకడ్బందీగా రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న తహసీల్దార్ ఆనందరావు

పద్మనాభం: రెవెన్యూ సదస్సులు పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ కె.ఆనందరావు అన్నారు. గురువారం వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం నుంచి జనవరి ఎనిమిదో తేదీ వరకు జరగనున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

రెవెన్యు సదస్సుల షెడ్యూల్ విడుదల

మధురవాడ: శుక్రవారం పరదేశిపాలెం రెవెన్యు గ్రామంలో ఆర్‌జీకే కాలనీ కొత్త కల్యాణ మండపం, 7న కొమ్మాదిలో గల కమ్యూనిటీ హాలులో, 10న మధురవాడ కమ్యూనిటీ హాలు, 11న బక్కన్నపాలెం కమ్యూనిటీ హాలు, 12న పీఎంపాలెం రామాలయం వద్ద గల జీవీఎంసీ కమ్యూనిటీ హాల్, 13న రుషికొండ పోలమాంబ గుడి వద్ద కమ్యూనిటీ హాలు, 17న ఎండాడ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తామని అధికారులు చెప్పారు.

భీమిలి పరిధిలో..

తగరపువలస: భీమిలి అర్బన్, రూరల్ పరిధిలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. ఆయా గ్రామాల పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు వీటిని నిర్వహించనున్నట్టు తహసీల్దార్ రామారావు తెలిపారు. శుక్రవారం భీమిలి ఎంపీడీవో కార్యాలయంలో ప్రారంభమై 9న చిట్టివలస, 10న దాకమర్రి, 11 జేవీ అగ్రహారం, 12 కొత్తవలస, 13 కాపులుప్పాడ, 16 కేవీ భూములు, 17 కుమ్మరిపాలెం, 18 సంగివలస, 19 తాళ్లవలస, 20 తాటితూరు, 21 తగరపువలస, 23 అమనాం, 24 అన్నవరం, 26 బోడమెట్టపాలెం, 27 చిప్పాడ, 28 రామయోగి అగ్రహారం, 30 నిడిగట్టు, 31 నేరెళ్లవలసలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారు. జనవరి 2న టి.నగరపాలెం, 3 శింగనబంద, 4 మజ్జివలస, 6 చేపలుప్పాడ, 7 మూలకుద్దు, 8న నారాయణరాజుపేటలో నిర్వహిస్తారు.

పీఏసీఎస్ విలీనంపై పునరాలోచించాలి

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని (పీఏసీఎస్) పద్మనాభం మండలంలోని జిల్లా సహకార కేంద్రీయ బ్యాంకు (డీసీసీబీ) బ్రాంచ్‌లో విలీనం చేయడం తగదని భీమిలి మండల వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మజ్జివలస పీఏసీఎస్, భీమిలిలోని జిల్లా సహకార కేంద్రీయ బ్యాంకు పరిధిలో ఉండేదన్నారు. ఇప్పుడు స్పెషల్ ఆఫీసర్, పీఏసీఎస్ కార్యదర్శి మండలంలోని ప్రజాప్రతినిధులు, సంఘ సభ్యులు, రైతులకు సమాచారం లేకుండా ఏకపక్షంగా పద్మనాభం బ్యాంకులో విలీనం చేశారన్నారు. భీమిలి మండలానికి చెందిన తామంతా ఏ అవసరానికైనా తగరపువలస మీదుగా భీమిలి వెళ్లడానికే సౌకర్యంగా భావిస్తామన్నారు. వీళ్లు చేసిన నిర్వాకం కారణంగా ఇప్పుడు రైతులంతా రుణాలు తదితర అవసరాలకు పద్మనాభం వెళ్లే పరిస్థితి లేదన్నారు. యథావిధిగా మజ్జివలస పీఏసీఎస్‌ను భీమిలి డీసీసీబీ బ్రాంచ్‌లోనే కొనసాగించాలన్నారు. లేదంటే మజ్జివలస పీఏసీఎస్ ద్వారా లావాదేవీలను రైతులతో పాటు తామంతా బహిష్కరిస్తామని బంగారునాయుడు హెచ్చరించారు.

నేటి నుంచి దక్షిణ భారత చదరంగం పోటీలు



వివరాలు తెలుపుతున్న క్రీడా విభాగం డైరెక్టర్ విజయ్ కుమార్

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా భారతీయ విశ్వవిద్యాలయాల సంఘం (ఏఐయూ) ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 8వ తేదీ వరకు దక్షిణ మండల సౌత్ జోన్ పరిధిలోని 5 రాష్ట్రాలకు చెందిన అంతర్ విశ్వవిద్యాలయాల మధ్య మహిళల చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు గీతం క్రీడా విభాగం డైరెక్టర్ యు. విజయ్ కుమార్ తెలిపారు. ఈ పోటీలకు దక్షిణ భారత దేశంలోనే 65 విశ్వవిద్యాలయాల నుంచి దాదాపు 300 మంది క్రీడాకారులు పాల్గొనున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ,తమిళనాడు, కర్ణాటక, కేరళ నుంచి క్రీడాకారులు పాల్గొంటారన్నారు.

శ్రీవిద్యాశక్తి పీఠానికి విగ్రహాలు



కీటిన్‌పేటలోని శ్రీవిద్యాశక్తి పీఠం



వినాయకుడు, వారాహి అమ్మవారు, దుర్గాదేవి

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ కీటిన్‌పేటలోకి శ్రీవిద్యాశక్తి పీఠంలో శని, ఆదివారాల్లో విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు జరుగనున్నాయి. పీఠం వ్యవస్థాపకుడు సోమయాజుల కల్యాణచక్రవర్తి శర్మ ఆధ్వర్యంలో జరగనున్న ఈ ఉత్సవాలకు రాజమహేంద్రవరం నుంచి 17 విగ్రహాలు గురువారం తీసుకువచ్చారు. వీటిని కాలభైరవ అష్టమి సందర్భంగా ఆదివారం ఉదయం 8.32 గంటలకు ప్రతిష్ఠించి సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. తీసుకువచ్చిన విగ్రహాలలో వినాయకుడు, దుర్గాదేవి, రాహువు, కేతువు, మానసాదేవి, కాలభైరవుడు, వారాహి అమ్మవారు, స్ఫటిక శివలింగంతో పాటు నవనాగులైన మహాపద్ముడు, శంఖుపాల, అనంతుడు, తక్షకుడు, ఆదిశేషుడు, కర్కోటకుడు, వాసుకి, ధృతరాష్ట్రం, కాళీయం ఉన్నాయి.

అవంతిలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న బీఎస్ఎన్ఎల్ ఏజీఎం శ్రీనివాసరావు

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు జరిగే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం గురువారం ప్రారంభమయింది. బీఎస్ఎన్ఎల్ సహకారంతో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ప్రారంభమైన మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా నెక్స్ట్ జనరేషన్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్ ప్రోగ్రాం జరిగింది. బీఎస్ఎన్ఎల్ ఏజీఎం ఎం.శ్రీనివాసరావు కమ్యూనికేషన్స్ సిస్టమ్స్‌లో ఇప్పటికి ఉన్న వివిధ సాంకేతిక సమాచార వ్యవస్థ మధ్య హైస్పీడ్ ఇంటర్ కనెక్టివిటీ, వివిధ నెట్‌వర్క్‌ల టోపోలజీస్ ప్రాముఖ్యతను తెలియజేశారు.

ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యావేత్తలు, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కళాశాల డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, విభాగాధిపతి వి.శివభాస్కరరావు, కన్వీనర్ పి.శంకరరావు వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

పాలిథిన్ నిషేధానికి సహకరించాలి



పాలిథిన్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న శానిటేషన్

తగరపువలస: పాలిథిన్ నిషేధం పక్కాగా అమలు చేస్తామని జీవీఎంసీ భీమిలి జోన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహలక్ష్మినాయుడు అన్నారు. గురువారం స్థానిక ప్రయివేట్ మార్కెట్‌లో కూరగాయాలు, పూల వ్యాపారులతో పాటు చేపల మార్కెట్, టిఫిన్ సెంటర్ల వద్ద అవగాహన కల్పించారు. వ్యాపారులనుంచి పాలిథిన్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. వినియోగదారులు, వ్యాపారులు సహకరించాలని కోరారు. అవగాహన కార్యక్రమంలో శానిటేషన్ కార్యదర్శులు, సూపర్‌వైజర్లు సూరిబాబు, దాసు, సురేష్, మనోజ్, అఖిల్, కిరణ్, నగేష్, సిబ్బంది శ్యామ్, లక్ష్మి, సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

డెబ్రిస్ తొలగించరూ..!



ప్రథమ పావంచా వద్ద కొబ్బరి చిప్పలు



అనంతుని మెట్లపై దీపాలు వెలిగించగా మిగిలిన వ్యర్థాలు



అనంతుని మెట్ల వద్ద చెత్త

పద్మనాభం: అనంత పద్మనాభుని మెట్ల పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. రాష్ట్రంలో ఏకైక క్షేత్రంగా అనంత పద్మనాభ స్వామి భాసిల్లుతోంది. భక్తులు ఎక్కువగా అనంతుని గిరికి వస్తుంటారు. గత నెల 30న గిరి మెంట్లు పంక్తిపై దీపోత్సవం జరిగింది. దీపోత్సవంలో భక్తులు వెలిగించగా మిగిలిన వ్యర్థ ప్రమిదల డెబ్రిస్, కొబ్బరి చిప్పలు, చెత్తా చెదారంతో మెట్లు, పరిసర ప్రాంతాలు అధ్వానంగా తయారయ్యాయి. గిరి ప్రథమ పావంచా వద్ద నడవడానికి వీలు లేకుండా కొబ్బరి చిప్పలు వేసేశారు. ఐదు రోజుల నుంచి గిరి మెట్లు పరిసర ప్రాంతాలు డెబ్రిస్‌తో దర్శనమిస్తున్నప్పటికీ పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. సంబంధిత అధికారులు తక్షణం స్పందించి వ్యర్థాలు తొలగించాలని భక్తులు కోరారు.

మూలకు చేరిన కళారూపాలు



బీచ్‌రోడ్డును ఆనుకుని ఒకప్పుడు ఎంతో ఆకట్టుకున్న ఛత్రపతి శివాజీ విగ్రహం



ప్రస్తుతం పావురాల పార్కులో మూలన పడివున్న శివాజీ విగ్రహం



పావురాల పార్కులో నిరుపయోగంగా వివిధ కళారూపాలు

భీమునిపట్నం: భీమిలి బీచ్‌లో ఒకప్పుడు ఎంతో ఆకర్షణీయంగా ఉన్న విగ్రహాలు నేడు మూలకు చేరాయి. 2002లో అప్పటి మున్సిపల్ చైర్మన్ డీ.శైలేంద్రరెడ్డి బీచ్ పార్కు, బీచ్‌రోడ్డుతోపాటు పరిసరాల్లో ఎంతో ఆకర్షణీయంగా ఉండే విగ్రహాలు, కళారూపాలను ఏర్పాటు చేశారు. ఛత్రపతి శివాజీ విగ్రహం ప్రధాన ఆకర్షణగా ఉండేది. బోయివీధి సమీపంలోని బీచ్ రోడ్డు పక్కనే దీన్ని ఏర్పాటు చేయడంతో సందర్శకులు ఫొటోలు తీసుకునేవారు. అలల తాకిడికి ఈ విగ్రహం గట్టు కోతకు గురవడంతో శిథిలావస్థకు చేరింది. అలాగే బీచ్ వద్ద ఉన్న మరికొన్ని విగ్రహాలు కూడా దెబ్బతినడంతో వీటిన్నంటినీ లైట్ హౌస్ ఎదురుగా ఉన్న పావురాల పార్కు వద్ద డంప్ చేశారు. చిన్నపాటి మరమ్మతులు, రంగులు వేసి మళ్లీ బీచ్‌వద్ద ఏర్పాటు చేయాల్సి ఉండగా అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా వదిలేశారు. ఇప్పటికైనా ఈ కళారూపాలను తిరిగి ఏర్పాటు చేయాలని సందర్శకులు కోరుతున్నారు.

మురుగు వివాదం

నమ్మివానిపేట-ఎన్ఆర్ఐ ఆస్పత్రి మధ్య తెగని పంచాయితీ



నమ్మివానిపేట ఎన్ఆర్ఐ హాస్టల్ వద్ద నిలిచిన మురుగు



నమ్మివానిపేటలో మురుగుతో దుర్వాసన

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు నమ్మివానిపేట గ్రామస్తులు, అనిల్ నీరుకొండ ఆస్పత్రి యాజమాన్యం మధ్య మురుగు వివాదం నడుస్తోంది. దీంతో ఆదర్శనగర్ సచివాలయం వైపు రహదారి దుర్గంధ భరితంగా మారిపోయింది. గతంలో ఆస్పత్రి యాజమాన్యం మార్చురీ రహదారితో పాటు గేటును నమ్మివానిపేట గ్రామం వైపు ఏర్పాటు చేయడాన్ని గ్రామస్తులు వ్యతిరేకించారు. ఆ కక్షతో ప్రస్తుతం నమ్మివానిపేట గ్రామస్తులు విడిచి పెడుతున్న డ్రైనేజీ నీరు తమ హాస్టల్ ముందు నుంచి వెళ్లకూడదంటూ ఆస్పత్రి యాజమాన్యం ఇటీవల లారీతో డెబ్రిస్ తెచ్చి డ్రైనేజీకి అడ్డంగా వేసింది. దీంతో రెండు వారాలుగా మురుగునీరు నమ్మివానిపేట వద్ద నిలిచిపోయింది. దీంతో మురుగు నిల్వతో దుర్గంధంగా మారింది. ఆదర్శనగర్ వైపు రహదారిని ఇరువైపులా మురుగు ముంచెత్తుతుంది. దీంతో భీమిలి నుంచి బ్యాంకు కాలనీ, నమ్మివానిపేట మీదుగా తగరపువలస వైపు రాకపోకలు సాగించేవారు ముక్కు మూసుకుంటే తప్ప వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. రాత్రి 8గంటల నుంచి వేకువజామున 4గంటల వరకు ఆస్పత్రి నుంచి వ్యర్థాలను బయటకు వదలడం వలన నమ్మివానిపేట, సంగివలస, ఆదర్శనగర్ వాసులకు ముక్కుపుటలు అదిరిపోతున్నాయి. దీంతో తలుపులు వేసుకున్నా ఇళ్లలో ఉండే పరిస్థితి కనిపించడం లేదు. బహిరంగంగా కాకుండా పైపులైన్ ద్వారా ఆస్పత్రి వ్యర్థాలను ఆదర్శనగర్ సచివాలయం వద్ద ఎర్ర కోనేటికి మళ్లించాలని నమ్మివానిపేట వాసుల అభ్యర్థనను యాజమాన్యం పట్టించుకోవడం లేదు. దీంతో నమ్మివానిపేట వాసులు ఆస్పత్రి వ్యర్థాలు వదిలిన చోట లారీలతో గ్రావెల్ వేసి అడ్డుకోవాలని యోచిస్తున్నారు. ఇరువర్గాల మధ్య వివాదం ముదురుతున్నా, దుర్గంధం కారణంగా నమ్మివానిపేట, సంగివలస, ఆదర్శనగర్ వాసులు వ్యాధుల భారిన పడుతున్నా భీమిలి జోన్ శానిటేషన్ అధికారులు తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. దీనిపై భీమిలి పోలీసులు జోక్యం చేసుకుని జీవీఎంసీ అధికారుల సమన్వయంతో మురుగునీరు సాఫీగా వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.